

# విజయ రహస్యం

ఏమి వాయ్! మైడియర్ షేక్స్‌పియర్! మా వెంకటేశంలా మొహం వేల వేసినావ్! కిషోర్ సాహూ మళ్ళీ నీ మీచ్చెయి జేసుకుంటా నంటున్నాడా? శాంతారాము క్కాళిడోస్ మీద మోజు విరిగి నీ వేపు తిరిగిందా! చందాల సంస్థ లేవైనా నీ పుస్తకాల్ని-- "చదువూ సంధ్యూ, పనీ పాటా లేకుండా తిరుగుతున్న మావాడోడున్నాడు" గాడి చేత తర్జుమా వేయిస్తారా? అలాంటిదేం ఉపద్రవం ఉన్నట్లు తోచదోయ్! మైనరు క్లాసిక్కులకి మంచి రోజులు కావు తప్ప, నీలాటి మేజర్రకానికేవ్వీ ఆపదున్నట్టు తోచదే. యావన్నావూ! నేనా? దొ మీనెత్ మీ? ఓ మై రీమారీడ్ అంట్! ఓ మైగాడ్! ఒట్టు. నేనలాటి ఉద్యమంలో లేను స్మీ. కాపోతే ఒహటి. నా యొక్క ప్రజ్ఞ పేల్చే మహా యిది గూర్చి విన్న ప్రొడ్యూసర్లెవరేనా నాచేత నీ స్టోరీని పిక్చరు తీయించాలని దురాశపడుతున్నారేమో చాటుగా, నాకు మటుగు తెలీదు. ప్రమాణ పూర్తిగా చెబుతున్నాను. నేన్నీ జోలికి రానని అభయమిస్తున్నాను. మాట దప్పితే నినదభీషణశంఖము దేవదత్తమే. టెలుగు ఇడియంలే.

ఫ్రాంక్‌లీ స్పీకింగ్--మైడియరెస్ట్ షేక్స్‌పియర్, నీ స్టోరీలు అవుడ్డేటయిపోయాయి. ఇప్పటివి వేరు. అవి నీతికథలు కావు, అవినీతి కథలు. మీవి మాకు పనికిరావు. పైగా అంత బ్రిలియంటువాట్ని జనం హరాయించుకోలేరుష, నా అంత బ్రిలియంటువాణ్ణీ

భరాయించుకోనూ లేరుష. అందికే నేనిలా గఘోరిస్తున్నా. బిట్వీన్ యు అండ్ మీ. మన్లో మన మాట. ఇక్కడ బ్రిలియన్సు పనికి రాదు. ఎందుకంటే స్టూడియోలో హైపవర్ ఫ్లడ్‌లైట్లతో జనవంతా కలిసి జాగర్తగా లైటిం గెరేంజి చేస్తారుగదా. తీరా అంతా అయ్యాక నువ్వక్కడ నిలబడితే నీ బ్రిలియన్సువల్ల ఎక్కడో గ్లేరుకొడుతుంది. అంతా చెడుతుంది. ఎవడ్రా ఇక్కడెవరో బ్రిలియంట్ల వెధవలున్నట్లున్నారు తన్ని తగిలీయండంటారు.

లక్షల్తో వ్యాపారవా మజాకానా, నామటుకు నేను, నాలాగే ఎందరో డ్రిప్యూసర్లు వేసుకు నివురుగప్పుకు మరీ నిప్పులా తిరుగుతున్నాం. ఇక్కడ ఎవడి మటుకు వాడు-- ముఖ్యంగా డైరెక్టరుగాడు తన చిత్తం వచ్చినట్టు షయినయిపోతానంటే వల్ల కాదు. ఆర్కెస్ట్రాలో వాయిద్యాల్లా సెట్‌మీద లయిట్లలా డోసుమీరకుండా గడుపుకు రావాలి. చూసేవాళ్ళైనా అంతే. ఎగబడి పొగిడిందుగ్గాని, తెగిడిందిగ్గాని యంతమాత్రం వీల్లేదు దిస్, మైడియర్ షేక్స్‌పియరు ఇన్ షార్ట్.

అయ్య ఆయ దయచేయండి రావుగారు. ఎన్నాళ్ళకెన్నాళ్ళకీ-- షేక్స్‌పియరుగారూ మీర్తరవాతెప్పుడన్నా కనబడండి. సావకాశంగా కబుర్లు చెప్పుకుందాం--రండి--మీకోసవే చూస్తున్నా సార్. మూడ్రోలాయి మీ స్క్రిప్టు మీదనే కూచుని అయిడియాలు పొదుగుతున్నా. ఏదీ దయ లేదు. మీరేం చేస్తార్లెండి. అగ్నిహోత్రావధాన్లవారు డిస్ట్రిబ్యూషను తీసుకున్నారేగాని ఒక్క విడత గూడా డబ్బిచ్చినట్టు లేదు. అంతేనా, నాకు తెలుసుగా, పదండి ఇద్దరం వెళ్దాం. వారికి నామీద గురి వుంది. నేను డైరెక్టర్నంటే వెంటనే చెక్కు రాసిస్తాడు.... అంతేసార్. మీరలా షాకవకండి. అదే నా ప్రజ్ఞ. "నైలిన్‌రోమ్ బియే రోమన్" అన్నాడు రోముడు. అలాగ్గా నేనున్నూ అలా ఊసరవెల్లిలా రంగు ఫిరాయించి ఇంటర్నేషనల్ క్లాసు నించి దిగి వచ్చాను. రావడవే గాక, "వీడు బ్రిలియంట్ మప్పురా. డైరెక్షనుకి బెస్టురా" అనిపించేసు కున్నాను. ఇందుగురించి బొంబాయిలో ట్రైనింగ యిచ్చారెండి.

చిత్తం. ఈ సూత్రాలన్నీ ఇక్కడ చాలమంది పెద్దలు చెప్పగా విన్నాను గదండి. నిజవే. క్లాసుపిక్చర్లకి డబ్బు రాకపోవడానికి క్కారణం భేషుగ్గా బోధపడిందండి. మీ మాటా రైటే. ఏడుపుసీనులొస్తే క్లాసు డైరెక్టరు రెండు సైలెంటు షాట్లలో గుండె బద్దలయ్యేలా తీసవతల పారేస్తాడు. జనం ఏడ్చేడ్చి రెండో మారిహ వెళ్ళరు. ఎందుకు బాబూ

ఏడుపొస్తుందని. వెళ్లాల్సిన అవసరంవూ వుండదు. ఆ పిక్చరు చూసి నాల్నెల్లదాకా కళ్ళముందాడుతూనే వుంటుంది. మనసులో మెదుల్తూనే వుంటుంది. ఇహనెందుకూ డబ్బు దండగనిపిస్తుంది. అదే హిట్ డైరెక్టరయితే ఏడుపుగొట్టు సీన్లని ఏడిసినట్టు తీసి చక్కగా నవ్విస్తాడు. జనం నవ్వుతో ఏడ్చి ఇవతలకొస్తారు. మళ్ళీ మళ్ళీ నవ్వుకుందికీ, సరదాగా ఏడిచిందికీ వస్తారు. చూసిందల్లా అరిటికాయకల్రులా మనసుకి పట్టుకోదు కాబట్టి, అందులో విషయం పట్టుగోవాలన్న పంతంతో కథను చెప్పగలగాలన్న సరదాతో జనం పదేసిమార్లు చూస్తారు.... నే చెప్పిందంతా రైటేనా? ఏవనుకున్నారు మరి. నేను ఏకసంతగ్రాహిని సార్. బ్రిలియంట్ ఫెలోని ఐమీన్, కాను.

* * * *

అఫ్‌కోర్స్ నేనెప్పుడూ మీ సలహాని క్వెశ్చన్ చెయ్యను, అంత అవివేకినా? మీరే ఏవిటి, ఏ ప్రొడ్యూసరేనా సరే. అర్టు డైరెక్షను, మ్యూజిక్ డైరెక్షను, డెరెక్షనల్ డైరెక్షను, డైలాగుల దర్జీపని, దర్జీపని (ఎడిటింగు), సవుండు రికార్డింగు, మేకప్పు, ఈ అడ్డమైన విద్యలున్నూ ధరోగా, క్షుణ్ణంగా తెలుసుకునే వుంటాడు. లేకపోతే పాతికవేలు పెట్టుబడి పెడతాడా. ఏదో బద్ధకం కొద్దీ, పని తొందరకొద్దీ ఒక్కో డిపార్ట్‌మెంటు కొక్కొక్కణ్ణే వేస్తాడు. అంతే తప్ప వారికి తెలీకనా ఇవేవన్నా బ్రహ్మవిద్యలా. అయినా ఈ ఆర్టిస్టులూ, టెక్నీషియనులూ స్వతంత్రం అంటూ రొదపెడతారు. వాళ్ళమొహాలు. ఈ అన్నిటిమీద ప్రొడ్యూసర్లు అథారిటీ కాదంటారు. ఏం పాపం ప్రొడ్యూసర్లు మటుకొప్పుకోటం లేదూ. అన్నిటిమీదా తమకన్న అథారిటీలు డిస్ట్రిబ్యూటర్లనీ! ఏదో హీరో హీరోయిన్‌లు విలన్‌జీల యాక్టింగన్నారు--అది వదిలెయ్యొచ్చు. వాటిమీద మహా మహా ప్రొడ్యూసర్ డిస్ట్రిబ్యూటర్లే అథారిటీలు కావంటున్నప్పుడు ఈ డైరెక్టరు పొడిశేశాడా యేవిటి. అందికే నేను మొదట్నించీ అంటున్నాను ప్రొడ్యూసరే డైరెక్టరు కావాలని, వీలైతే రైటరున్నూ అని. బొంబాయిలో ఈ డైరెక్టరుగాళ్ళ బెడద పళ్ళేక చాల మంది ప్రొడ్యూసర్లే అందుకు వడికట్టారు. ఏవుంది, నాలుగు రీళ్ళు తిరిగే సరికి వాళ్ళూ యేసు డైరెక్టర్లయ్యారు. ఇదేవన్నా బ్రహ్మవిద్యా. అంచేతే నేను చెప్పేదేవిటంటే మీరు నన్ను డైరెక్టరుగానే గాక ప్రొడ్యూసరుగా కూడా చేసుకోండి. ఆ డబ్బేదో ఇలా నా మొహానపారేసి మీరు సుబ్బరంగా ఏ వూటీవో పోయి

కాలుమీద కాలేసుక్కూచోండి. రాజేంద్రకిషనూ, ఆత్రేయ మూడ్సుకోసం ఎలాగా అటొస్తార్షు గాబట్టి అక్కడే వాళ్ళచేత నెక్స్ట్‌పిక్చరు ట్రిబుల్‌వర్షను సాంగులు రాయించెయ్యండి. స్టార్లు రెస్టుకోసం వస్తారు గాబట్టి ఆ పాటల్నక్కడే మంచి సీనరీలో పిక్చరైజు చేయించండి. వీల్లైతే రెండుమూడు లవుసీన్లు, ఓ కోయడాన్సు (ఊటీలో వుంటార్లెండి) లాగిపారేయించండి. తరువాత మనం పిక్చరు తియ్యక పోయినా వాట్ని విడిగా అమ్మేసుకోవచ్చు.

ఈలోపల్నే నిక్కడవలీలగా డబుల్‌వర్షను లాగి పారేస్తాను. ఎలావుం దయిడియా. బ్రిలియంటుగా లేదు గదూ. అదే కావలసింది. మీ ఆశీర్వచనబలం.

మరొహటి. ఊటీలో మీకు గైడుగా కావాలంటే చక్కటి ఫామిలీ పిక్చరుక్కావలసిన సినీచక్రపాణీనీయ సూత్రాలన్నీ ఓ బుక్కులో రాసిస్తాను. ఎవరికీ చూపెట్టకండేం. గుట్టుగా చదువుకున్నాకు పంపెయ్యండి. మన పిక్చర్లు హిట్టయితే ఆనక 'సీక్రెట్ ఆ ఫవర్ నక్సెస్' అనే పేరుతో బుక్కులు రాసి పబ్లిషు చేదాం.

అసలీ చక్రపాణీనీయం సర్వకాలాలకూ సర్వదేశాలకూ వర్తించే మహా వ్యాకరణం. అయినా, మహా గ్రంథాలన్నిటిలాగే దీనికీ కువ్యాఖ్యల, దుర్నిర్వచనాల బాధ పట్టింది.

కుటుంబంలో యావన్మందిన్నీ అనగా తల్లీ, తండ్రీ, కూతురూ, కోడలూ, కొడుకులూ, అల్లుడూ, పెళ్ళీడుపిల్ల, దాని తమ్ములూ, ఆ యింటి అవ్వ, ఇంటి నౌకరూ, వాడి నాయుడుబావా, అతని తాలూకా నారాయణమ్మ అందరూ కలిసి సినిమాకొస్తారని గుర్తుంచుకొని అందుకు తగ్గవిధంగా సినిమా తీయవలెను అని ఒక సూత్రం. అయితే సూత్రాధారిటీలు, దానికి అనర్థకాలైన అర్థాలు తీశారు. తండ్రిక్కావలసింది కొంత, కొడుక్కి కావలసిన సెక్సప్పీలు, బామ్మక్కావలసిన హరికథ, కోడలికీ కూతురికీ కావలసిన చీరెలూ, సారెలూ, నగలూ, నాట్యాలూ, పిల్లలక్కావలసిన అస్సెం వయసువాడిక్కావలసిన రెండర్థాల మాటలూ, నగ్నసత్యాలూ, నాయుడుబావ, నారాయణమ్మలకోసం జానపదప్పాటలూ, కోయడాన్సులూ అన్నీ సాధ్యమైనంత ఎక్కువ డోసుల్లో కలిపి ఒక్క పిక్చర్లోనే పెట్టేస్తున్నారు.

"వ్యాకరణసూత్రాలు టూకీగా ఉండి కొద్ది మాటల్లో గొప్ప అర్థాలు చెప్పేమాట నిజమే కాని మరీ ఇంతలేసి భావాలుండవు. కుటుంబంలో అంతా కలిపి చూసిందికి

వీలుగా అసభ్యదృశ్యాలు జొరబడకుండా చూడమన్నారు తప్ప ఒక్కొక్కళ్ళకీ ఏవేం కావాలో అన్నీ రీళ్ళ కొద్దీ తోసెయ్యమనలేదు" అంటూ యిటీవల కొందరు విమర్శమీద విమర్శచేస్తూ క్రీటీకాతాత్పర్యాలు అఘోరించారు. మనం వీళ్ళని ఖండఖండాలుగా ఖండించాలి. పైజెప్పిన జాబితా ప్రకారమే అన్నీ అర్థం చేసుకోవాలనిన్నీ, ఇపుడు జరుగుతున్న దదేననిన్నీ, పడుచు వాడికి బాగున్నది తెరమీదున్నపుడు ఆడపడుచులు కళ్ళు మూసుకోవచ్చుననీ, రెండర్థాల డైలాగులకి రెండో అర్థం ఏమిటని పసిపిల్ల డడిగినప్పుడు వాడినోరూ చెవులూ మూసేయాలనీ ప్రేక్షకులు గ్రహించుకోవాలి. అంతేతప్ప ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు కాదు. యిలా వీళ్ళని శాసిస్తే కళ మలమల మాడిపోతుంది.

మున్ముందు కావాలంటే, ఇందుకు యాంత్రికంగా నదుపాయాలు చేద్దాం. తండ్రి ముందుగా ఒక్కడూవచ్చి సినిమా చూస్తాడు. తరువాత తనబలగాన్ని తీసుకెల్తాడు. అతని కుర్చీ దగ్గర కొన్ని మీటలుంటాయి. సినిమాలో అందరూ చూసే ఘట్టాలు అందర్నీ చూడనిచ్చి ఆపైన భార్య చూడతగనివి ఆవిడక్కనబడకుండా వినబడకుండానూ, పిల్లలు చూడతగనివి వాళ్ళక్కనబడకుండా వినబడకుండానూ, కోడలూ కూతురూ సిగ్గుపడే సందర్భాలు వాళ్ళకి కనబడకుండానూ మీటలు నొక్కి ఏర్పాటు చేస్తాడు. అలాటిది హాలీవుడ్ వాళ్ళు కనిపెడతారు. కాకపోతే మనవే ఏదో నాటుపద్ధతి కనిపెడదాం. అంతే తప్ప మన పద్ధతులు మార్చుకుంటామా--కుటుంబం అంతా కలిపి చూస్తారనీ! అంతగా కావలిస్తే విడి విడిగా చూడమనండి.

